క్లుప్తంగా

రక్తదాతలకు సన్మానం



ఆదోనిలో రక్తదాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆదోని అర్బన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలకు శుక్రవారం విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్ పెంచికలపాడు వారు ఘనంగా సన్మానించారు. ఆదోని పట్టణానికి చెందిన జన సేవా సామాజిక సేవా సంస్థ కార్యదర్శి విరూపాక్షి స్వామి 23 సార్లు, ప్రసాద్ 74 సార్లు, తిరుపతి 99 సార్లు, చంద్రశేఖర్ 150 సార్లు రక్తదానం చేసినందుకుగాను వారిని అభినందిస్తూ శాలువా కప్పి పూలబొకేలతో విశ్వభారతి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మునీరుద్దీన్‌అహ్మద్, ప్రొఫెసర్ మహేంద్రకుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం వల్ల మరొకరి ప్రాణాలు నిలబడతాయన్నారు. ప్రమాదాల్లో గాయపడి రక్తం అవసరమైన వారికి తగిన సమయంలో రక్తదానం చేస్తే వారి ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. రక్తదానం చేసి ప్రతిఒక్కరూ ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.

17 నుంచి తరగతులు ప్రారంభం

ఆదోని సెంట్రల్: ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి డిగ్రీ, ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభం అవుతాయని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మురళీమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చదువుతున్న మూడవ, ఐదవ సెమిస్టర్ విద్యార్థులు, సీనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. అదే రోజు నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీలలో చేరే విద్యార్థులకు అడ్మిషన్లు కూడా జరుగుతాయన్నారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు.

శ్రీమఠం విద్యాపీఠం విద్యార్థుల ప్రతిభ



మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు అద్వితీయ ప్రతిభ కనబరచారు. రాఘవేంద్ర అనే విద్యార్థి కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి ద్వైత వేదాంతంలో ఎంఏ పూర్తి చేశారు. విద్యార్థి ప్రతిభకు గానూ రెండు బంగారు పతకాలు అందుకున్నారు. అలాగే బాల సుబ్రమణ్యం అనే విద్యార్థి ద్వైత వేదాంతం, సంస్కృతంలో బీఏ పూర్తి చేసి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇరువురు విద్యార్థులను శుక్రవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అభినందించారు. పతకాలు, ప్రశంసా పత్రాలు, రివార్డులు అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు ఎస్సీ బాలుర వసతి గృహంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ నాగేశ్వరరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే 60 మంది విద్యార్థులున్నారని, మిగిలిన 40 సీట్లను ఎస్సీ విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు హాస్టల్‌లో లభిస్తాయని పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం పత్తికొండలోని ప్రభుత్వ కమ్యూనిటీ క్లస్టర్ కేంద్రంలో ప్రభుత్వ వైద్యులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 10 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన మాట్లాడుతూ.. రక్తదానం పట్ల ప్రజలు అపోహలు వీడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్యులు ఆదినాగేష్, ఇర్ఫాన్, సిబ్బంది దేవయ్య, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆదోనిలో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి



ఎమ్మిగనూరులో సూచనలు చేస్తున్న డీఎస్పీ సీతారామయ్య

- 17న బక్రీద్ పండగ
- అన్నదమ్ముల్లాగా పండగను జరుపుకోవాలి
- ఎవరూ ఘర్షణలకు పాల్పడొద్దు
- సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తాం
- ఆదోని, ఎమ్మిగనూరు డీఎస్పీలు శివనారాయణస్వామి, సీతారామయ్య



సమావేశానికి హాజరైన పీస్ కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సీతారామయ్య సూచించారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముస్లిం, హిందూ, క్రిస్టియన్ మత పెద్దలు పండగల విశేషాలను తెలుపుతూ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీతారామయ్య మాట్లాడుతూ.. ముస్లింలు బక్రీద్ పండగ రోజు ఎలాంటి చిన్న సంఘటనలు కూడా జరగనివ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఎమ్మిగనూరు పట్టణం ప్రశాంతతకు నిదర్శనమని, ఆ గుర్తింపును నిలబెట్టకోవాలన్నారు. అలాగే చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. అన్ని కులాలు వారు అన్నదమ్మల్లా ఉంటారని, ఎక్కడో చిన్న పొరపాటు జరిగితే అది అందరికీ వర్తిస్తుందని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అన్ని కులాల మత పెద్దలపై ఉందన్నారు. బక్రీద్ నేపథ్యంలో ముస్లింలు పోలీసులకు సహకరించాలని, చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, టౌన్, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, ఎస్ఐలు రమేష్‌బాబు, శరత్‌కుమార్‌రెడ్డి, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోవును వధిస్తే కేసులే

ఆదోని అర్బన్: తెలిసి తెలియక బక్రీద్ పండగ వచ్చిందని గోవధ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివనారాయణస్వామి హెచ్చరించారు. ఈనెల 17వ తేదీన బక్రీద్ పండగ సందర్భంగా ఆయన శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని, మత ఘర్షణలకు తావివ్వరాదన్నారు. అనవసరంగా గొడవలు పడొద్దని సూచించారు. సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్నదమ్ముల్లాగా పట్టణంలో ఇరువర్గాలవారు కలిసిమెలిసి పండగను జరుపుకోవాలన్నారు. సీఐలు తేజమూర్తి, గోపీ, నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు మధుసూదన్, శ్రీనివాసులు, పీరయ్య, ఎర్రిస్వామి, మగ గురువులు, మతపెద్దలు పాల్గొన్నారు.



మంత్రాలయంలో సూచనలు చేస్తున్న ఎస్ఐ గోపినాథ్

మంత్రాలయం: ఈనెల 17వ తేదీన బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ గోపినాథ్ సూచించారు. శుక్రవారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ రోజున అందరూ స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా గోవధ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గోవధ చేయకుండా పర్వదినం జరుపుకోవాలని ముస్లింలకు సూచించారు. ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా నడుచుకోవాలని సూచించారు.

కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ విద్యాలయంలో ఎంపీహెచ్‌బ్ల్యూ (నర్సింగ్) కోర్సును ప్రవేశ పెట్టినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.అంజలిదేవి శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్సులలో భాగంగా రిటైల్ మార్కెటింగ్ కోర్సును విద్యాలయంలో అధికారులు ప్రవేశపెట్టారు. అయితే ఈ కోర్సుపై విద్యార్థులు పెద్దగా అసక్తి చూపకపోవడంతో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును ప్రవేశపెట్టాలని అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతం అందులో బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కోర్సు కావడంతో అధికారులు స్పందించి ఈ కోర్సును ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీసీ, పదోత తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో తదితర సర్టిఫికెట్లు జతచేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే భాస్కర్ రెడ్డి కాలనీలోని కేజీబీవి మైనార్టీ విద్యాయలంలో సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దెబ్బతిన్న హెబ్బటం పెద్దవంక చెరువు గట్టు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు



దెబ్బతిన్న గట్టును చూపిస్తున్న రైతు

హొళగుంద: హెబ్బటం గ్రామం వద్ద ఉన్న పెద్దవంక చెరువు గట్టు దెబ్బతినడంతో మైనర్ ఇరిగేషన్ డీఈఈలు చెన్నకేశవనాయక్, షఫీ, ఏఈ ఫణికుమార్ శుక్రవారం పరిశీలించారు. గట్టుకు సంబంధించి పలు చోట్ల బొంగులు(గుంతలు) పడడం వల్ల చెరువు పూర్తిగా నిండితే గట్టు దెబ్బతిని గండి పడే అవకాశం ఉన్నట్లు హెబ్బటం రైతులు తెలిపారు. మరమ్మతు పనులు చేయాలని కోరారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

తుగ్గలి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 600 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నట్లు డ్వామా క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ.. మండలంలో 600 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఐదెకరాల్లోపు మెట్ట భూములున్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇప్పటికే 250 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరితగతిన టార్గెట్ పూర్తిచేస్తే వెంటనే అనుమతులు వస్తాయని తెలిపారు. మామిడి, సపోట, దానిమ్మ, డ్రాగన్, చీని తదితర పండ్ల మొక్కల పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద మూడేళ్ల పాటు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. క్లస్టర్ టీఏ గంగన్న, ఎంటీసీ నారాయణ, ఈసీ పెంచలయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



బీసీ బాలికల హాస్టల్‌లో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా అన్నారు. ఆయన శుక్రవారం గోనెగండ్లలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల హాస్టల్స్, బీసీ బాలికల వసతి గృహంలో వైద్య సిబ్బందిచే దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయని, వర్షాకాలంలో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా చర్యగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని హాస్టళ్లలో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వీటి నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ తమ గృహాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ హనుమంతు, ఎంపీహెచ్ఎస్ పరమేష్, ఏఎన్ఎం రాజమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు

ఎమ్మిగనూరురూరల్: జిల్లా వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు ఆ సంఘం నాయకులు తిమ్మారెడ్డి, నాగరాజు, ఉసేని, వెంకటేశ్వర్లు, శేఖర్, తిమ్మన్న, నారాయణ, నరసింహులు తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, పురపాలక పాఠశాలలో చదివి 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పురస్కారాలను అందచేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీన ఆదోని పట్టణంలోని మంగళ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన వాల్మీకి విద్యార్థినీ, విద్యార్థులు తమ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోని హాజరుకావాలన్నారు. ఇప్పటికీ పేర్లు నమోదు చేసుకోని విద్యార్థులు 94902 10386, 63038 25578 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాని కోరారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



ఎంఈఓ-2 మధుసూదన్‌రాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని గురుకుల, ముస్లిం మైనార్టీ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులను ప్రోత్సహించాలని మండల విద్యాధికారి-2 మదుసుధన్‌రాజు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో.. గురుకుల, ముస్లిం మైనార్టీ పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన అభినందన సభకు ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గురుకుల, ముస్లిం మైనార్టీ పాఠశాలల్లో సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా పాఠశాలలకు పంపాలని సూచించారు. పత్తికొండ, శ్రీశైలం (సున్నిపెంట), బనగానపల్లి (గువ్వలకొండ), డోన్, ఆరేకల్, వెల్దుర్తి, కర్నూల్ ముస్లిం మైనార్టీ పాఠశాలలకు మైబూన్, వహీద్, జగదీష్, పృథ్వీరాజ్, మనోహర్, మైబూన్, సన, పవిత్ర, తబస్సుమ్, ముజుద్‌వలి, ఆఫ్రీన్, హస్మత్, హసన్ అనే విద్యార్థులు ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగన్న, గ్రామ పెద్దలు కరుణాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, స్కూల్ చైర్మన్ నూర్‌అహమ్మద్, పంచాయతీ ఉప సర్పంచ్ ఈరన్న, షాజహాన్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి



అంగన్‌వాడీ సీడీపీఓ నాగమణి, ఎంఈఓ-2 నాగేశప్ప సమక్షంలో పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న తల్లులు

కోసిగి: ప్రతి ఇంట్లో ఐదేళ్ల నిండిన పిల్లలందరినీ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ-2 నాగేశప్ప సూచించారు. శుక్రవారం కోసిగిలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీడీపీఓ నాగమణి సమక్షంలో అంగన్‌వాడీలో చదివిన పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. కోసిగి మండలంలోని 69 అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్‌లో చదువుకుని ఐదేళ్లు నిండిన పిల్లలను మొదటి సెక్టార్ నుంచి 288 మంది, 2వ సెక్టార్ నుంచి 259 మంది, 3వ సెక్టార్ నుంచి 257 మంది పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పిల్లల తల్లులకు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకున్న ప్రీస్కూల్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా పాఠశాలలో అడ్మిషన్ చేస్తారని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మొక్కలు నాటాలని సీడీపీఓ కార్యకర్తలకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయిని, సెక్టార్ లీడర్లు లూసమ్మ, హెప్సిబారాణి, వరలక్ష్మి, శైలజ, మద్దమ్మ, భీమలింగమ్మ, జ్యోతి, నాగవేణి, దేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలి

గోనెగండ్ల: క్లోరినేషన్ చేసిన మంచినీటినే కొళాయిలకు సరఫరా చేయాలని ఈఓఆర్డీ నాగేష్ సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత వారం రోజులుగా మండలంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ట్యాంకుల నుంచి క్లోరినేషన్ చేసిన శుద్ధమైన నీటినే సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వర్షాలు బాగా కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న చోట, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే పారిశుద్ధ్య పనులు కూడా చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఏఓ బాబుభాస్కర్ ఉన్నారు.

ఆదోని అభివృద్ధికి కృషి చేయాలి



మున్సిపాలిటీ అభివృద్ధిపై ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథితో చర్చిస్తున్న కమిషనర్, ఉద్యోగులు

ఆదోని టౌన్: ఆదోని అభివృద్ధిని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో నియోజకవర్గ స్థాయి జనసేన, టీడీపీ, బీజేపీ నేతలతో పాటు అన్ని శాఖల అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. పార్టీల వారీగా కూటమి నాయకులతో చర్చించారు. గ్రామాల్లో, వార్డుల్లో ఎన్నికలు ఎలా జరిగాయి, ఎంత మెజార్టీ వచ్చింది, అడ్డంకులు, అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వారంలోగా ఆదోని మున్సిపాలిటీలో మార్పు కనిపించాలని కమిషనర్ రామచంద్రారెడ్డికి సూచించారు. ప్రధానంగా శానిటేషన్, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. మురుగు వాడలు, శివారు ప్రాంతాల్లో నీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని ఇకపై అన్ని ప్రాంతాలకు సమానంగా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని కమిషనర్‌కు సూచించారు. డీఎస్పీ శివనారాయణస్వామితో పాటు సీఐలు, ఎస్ఐలతో శాంతిభద్రతల పరిరక్షణపై సమీక్షించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి ఆదోనికి మంచిపేరు తీసుకురావాలని సూపరింటెండెంట్, వైద్యులకు సూచించారు. నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

ఆదోని అర్బన్: ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి శుక్రవారం కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను కలిశారు. పూలబొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరినట్లు చెప్పారు.

వేదావతిలో కొనసాగుతున్న వరద ఉధృతి



మార్లమడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి నది

హొళగుంద: ఆంధ్రా-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద వేదావతి(హగరి) నదిలో వరద ఉధృతి శుక్రవారం కూడా కొనసాగింది. నది ఎగువ భాగంలోని రాయదుర్గం, గుంతకల్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగింది. పంటల సాగుకు అనువుగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహం పెరగడంతో రైతులు నదిలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్లు, పైపులను తొలగించారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలోని బైరవాని దీప ప్రాజెక్ట్ నించి దిగువకు నీరు వదిలితే నది ఉగ్రరూపం దాల్చుతుందని ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయని మార్లమడికి గ్రామస్తులు తెలిపారు. కాగా నదిపై నిర్మించిన వంతెన ఎత్తు లేకపోవడం వల్ల తరుచూ రాకపోకలు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని.. కొత్త వంతెన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- పచ్చిమిర్చి, కాకరకాయ, బీరకాయ కిలో రూ.100పైనే
- సామాన్యుడు కొనడం కష్టమే



గోనెగండ్లలో కూరగాయల దుకాణం

గోనెగండ్ల: కూరగాయల ధరలు రోజురోజుకు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. అయితే ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య ప్రజలు వాటిని కొనలేని పరిస్థితిలో ఉన్నారు. రోజురోజుకూ ధరలు పెరిగిపోతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులకు భారంగా మారింది. వీటిని కొనలేం తినలేం అన్న పరిస్థితి నెలకొంది. రెండు వారాల క్రితానికి, నేటికి కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయని సామాన్యులు వాపోతున్నారు. రెండు వారాల క్రితం పచ్చిమిర్చి కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం కిలో రూ.100కు పైగా చేరింది. కాకరకాయ కిలో రూ.30 ఉండగా ప్రస్తుతం కిలో రూ.100కు చేరింది. బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.100కు చేరింది. అలాగే క్యాబేజీ కేజీ రూ.60, ఆలుగడ్డ కేజీ రూ.60, బెండకాయ కిలో రూ.60, వంకాయ కిలో రూ.40, టమాట కిలో రూ.40 పలుకుతున్నాయి. వేసవిలో కూరగాయల దిగుబడి తగినంతగా లేకపోవడంతో ప్రస్తుతం కొరత ఏర్పడింది. దీంతో వ్యాపారస్తులు అధిక ధరలు పెట్టి కూరగాయలను కొనుగోలు చేసి దుకాణాల వద్ద అధిక ధరకు విక్రయిస్తున్నారు.

లూజు విత్తనాలు కొనొద్దు

మద్దికెర: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని దళారీలు, మధ్యవర్తులు అమ్మే లూజు విత్తనాలు కొని మోసపోవద్దని ఏఓ రవి సూచించారు. విత్తనాల కొనుగోలుపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ వారిచే అనుమతి పొందిన డీలర్స్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి విత్తన పాకెట్‌లకు తప్పకుండా రసీదు, బిల్లుతో పాటు విత్తన సంచుల లేబుల్స్‌ను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. లూజు విత్తనాలు కొని పంట నష్టపోతే వారికి నష్టపరిహారం రాదన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలో 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేస్తుండడం వల్ల ఆదోని నియోజకవర్గం మొత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

18వ తేదీలోగా పాఠశాలలో చేరాలి

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి గత ఏప్రిల్ 21వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోగా తగిన ధ్రువపత్రాలతో పాఠశాలలో అడ్మిషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సూచించారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. పాఠశాలలో చేరేందుకు ఒరిజనల్ రికార్డు షీట్ (టీసీ), స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్, రేషన్ కార్డు, రెండు పాస్‌ఫొటోలు, విద్యార్థి, తల్లిదండ్రులకు సంబంధించిన ఆధార్ కార్డు, తీసుకుని 18వ తేదీలోగా పాఠశాలలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 19వ తేదీన పాఠశాలలో రెండవ విడత కౌన్సిలింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.